



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఉరితాళ్లతో అంగన్వాడీల నిరసన

- 28వ రోజు కొనసాగిన నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడీల సమ్మెను అణచివేయడానికి ఎస్మా చట్టాన్ని తీసుకు రావడాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలులో ఉరితాళ్ళు బిగింపుకొని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ధర్నా చౌక్‌లో 24 గంటల దీక్షను రెండవ రోజు ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, అంగన్వాడి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 28 రోజులుగా చేస్తున్న సమ్మెను పరిష్కరించలేక జగన్ ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని తీసుకువచ్చి జీవో నెంబర్ 2 ను విడుదల చేయడం పట్ల అంగన్వాడీలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారన్నారు. 6 వతేదిన సాయంకాలం లోపల విధులకు హాజరు కావాలని చెప్పడం ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమని తెలిపారు. ఇంతటి నిర్బంధాలు విధించి తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందన్నారు. అంతే కాకుండా జగన్ ప్రభుత్వం ఆత్మహత్యలు చేసుకోవడానికి ఉసిగొల్పు తుందన్నారు. అంగన్వాడీలు ఉరి తాళ్లతో బిగించుకొని వినూత్నంగా నిరసనను వ్యక్తం చేశారు. 28 రోజులుగా ప్రభుత్వం అనేక ఖర్చులు పెడుతూ అంగన్వాడీల జీతాలు పెంచడంపై ఇంత దారుణంగా ప్రవర్తించడం సరైన పద్దతి కాదని వారు తెలిపారు. ఈ దీక్షలలో కర్నూలు రూరల్ ప్రాజెక్టు వారు బి.రేణుకమ్మ, నాగమణి, పుష్ప, నాగేశ్వరి, వరలక్ష్మిరమాదేవి, మల్లమ్మ, స్వాతి, మెహబూబ్బి, మద్దమ్మ, ఎం.అరుణ, ఎం.సత్యవతి, విజయలక్ష్మి లోకేశ్వరి, ఎ.శాంత కుమారి, ఎం రమణమ్మ, జి.రాజసులోచన, ప్రశాంతి, హజరాంబి కూర్చున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. అబ్దుల్ల, నగర కార్యదర్శి సాయి సమ్మెకి మద్దతు తెలిపారు. సిఐటియు నగర కార్యదర్శి సిఎస్ సాయిబాబా ఎం.గోపాల్, కె.సుధాకరప్ప, ఎం.విజయ, రామాంజనేయులు, కె.రామకృష్ణ, ఎస్.మహ్మద్, రఫీ, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, నగర అధ్యక్షులు రామాంజనేయులు, ఎం.నల్లన్న, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించ కుండా మహిళలను వైసిపి ప్రభుత్వం రోడ్డుపాటు చేసిందని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులులు పి.నిర్మల విమర్శించారు. 28వ రోజు గూడూరులో పి.నిర్మల, సిఐటియు రాష్ట్ర నాయకులు బి.రామాంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుస్సేన్ బాషా సంఘీభావం తెలిపారు. పి.నిర్మలమ్మ, బి.రామాంజనేయులు మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నా రు. ఎస్మాలాంటి చట్టాలకు అంగన్‌వాడీలు భయపడరని హెచ్చరించారు. మహిళల పక్షపాతి ప్రభుత్వమని, ముఖ్యమంత్రితో సహా ఎంపీలు ఎమ్మెల్యేలంతా చెప్పుకుంటూ తిరుగుతున్నారని, మరి అంగన్వాడీలు మహిళలు కాదా అని ప్రశ్నించారు. త్వరగా న్యాయం చేయకపోతే రాబోయె ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె. మోహన్, మండల నాయకులు జె.రాజశేఖర్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, ఇందుమతి, రత్నమ్మ, సుజాత, మంజుల, మహేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో ఉరి తాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



గూడూరులో మాట్లాడుతున్న నిర్మలమ్మ

పోలింగ్ కేంద్రాల్లో
మౌలిక వసతులకు చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన
- కలెక్టరేట్‌లో స్పందన
- ఆడుదాం ఆంధ్రపై వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు నాణ్యతతో, గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో మాట్లాడి సంతృప్తి చెందే విధంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్, డోర్స్, కిటికీలు, విద్యుత్, లైట్లు, ఇంటర్నల్ వైరింగ్, విద్యుత్ సరఫరా కోసం సాకెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడులో కవర్ కాని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, అందుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధులను నిర్వహించేందుకు సిబ్బంది వివరాలను గురువారం లోపు సమర్పించాలన్నారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి (ఖజానా శాఖ డిడి)ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిఆర్ఓ కె.మధుసూదనరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, నాగప్రసన్న లక్ష్మీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండల స్థాయి పోటీలు జనవరి 10 నుండి అన్ని మండలాల్లో ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో పోటీలు పూర్తయ్యాయని, అందుకు సంబంధించి ముగింపు వేడుకలు నిర్వహించి ఫోటోలు అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఈ నెల 11 వరకు జన్‌భాగీదారి కార్యక్రమం నిర్వహించాలన్నారు. సచివాలయాల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫోటోకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, వాలంటీర్లు, సిబ్బంది పూల దండ వేసి నివాళు లు అర్పించే కార్యక్రమం నిర్వహించాలన్నారు.

చట్టాన్ని వెంటనే విరమించుకోవాలి

- డ్రైవర్‌కమ్ ఓనర్ల అసోసియేషన్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల పేరుతో చట్టం తెచ్చి డ్రైవర్లను, ఓనర్ కమ్ డ్రైవర్లను జైళ్లకు పంపించే ప్రయత్నాలను విరమించుకోవాలని డ్రైవర్లు, ఓనర్ కమ్ డ్రైవర్ల అసోసియేషన్ డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టరేట్ ఎదుట డ్రైవర్లు ఓనర్ కం డ్రైవర్ల అసోసియేషన్ ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎస్.నౌషాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా రంగంలో లోడింగ్ అన్ లోడింగ్, ఆటోమొబైల్ తదితర రంగాలలో దాదాపు రూ.15 కోట్ల మందికి ఉపాధిని కల్పిస్తుందన్నారు. ఈ ప్రైవేటు రంగంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పగబట్టినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. అదానీ అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు కుట్ర చేస్తుందన్నారు. సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఎస్.అన్వర్‌బాష మాట్లాడుతూ ప్రమాదాల పేరుతో డ్రైవర్లను, ఓనర్ కమ్ డ్రైవర్లు పదేళ్లు జైలు శిక్ష రూ.10 లక్షల జరిమానా విధించే కేంద్రం ప్రభుత్వం చట్టం చేసి అమలు జరిపేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. వెంటనే ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా జరిగే స్టీరింగ్ చోడో సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అనీఫ్‌బాష ఆర్గనైజేషన్ కార్యదర్శి మహేష్, మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నిస్సార్, ట్రెజరర్ వెంకటేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు కె. శ్రీనివాసులు ధర్నాకు నాయకత్వం వహించారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పుల్లారెడ్డి

ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలి

- యుఇఇయు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని ఎస్ఇ కార్యాలయం ముందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. అన్ని శాఖలు, సంస్థల్లో ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామన్న ముఖ్యమంత్రి విద్యుత్ సంస్థలో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం అందరినీ రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం అందరికీ కనీస వేతనం చెల్లించాలని, అరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్లుగా పని చేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించబడిన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలన్నారు. బిల్ కలెక్టర్ ఏజెంట్లకు, ఎస్పీఎం కార్మికులకు విద్యుత్ స్టోర్ హమాలీలకు పీస్ రేటు రద్దు చేసి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కోలో సిబిడి కార్మికులకు ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం, కోలుకునే వరకు ప్రత్యేక సెలవులు ఇచ్చి వైద్య సౌకర్యం కల్పించి, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. సిపిడిసిఎల్‌లో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని కోరారు. ఇఎస్ఐ, పరిమితి దాటిన కాంట్రాక్టు కార్మికులకు మెడికల్ అలవెన్స్, మెడికల్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. మహిళా ఉద్యోగులకు ఇతర శాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా ఏడాదికి ఐదు ప్రత్యేక సెలవులు అమలు చేయాలన్నారు. కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్లలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రతి సబ్ స్టేషన్‌కూ గతంలోలాగా నైట్ వాచ్‌మేన్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంట్రాక్ట్ స్కిల్ కార్మికులకు నెలకు రూ.43,162 చెల్లిస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన దానితో కలిపి కేవలం రూ.27,953 మాత్రమే చెల్లిస్తోందని తెలిపారు. ఈ కాలంలో కొత్తగా జాయిన్ అయిన షిఫ్ట్ ఆపరేటర్లకు కేవలం రూ.18,500 మాత్రమే చెల్లించి దోపిడీ చేస్తోందని విమర్శించారు. విద్యుత్ కార్మికులు కె.భీమేష్, ఈ.ప్రవీణ్ కుమార్, ఎం.జావిద్‌మియా, బి.మల్లికార్జున రెడ్డి, జె.యూనస్ బాష, జె.సంతోష్, బి.నాగరాజు, బి.రాముడు, ఎం.రామాంజనేయులు కూర్చున్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

19న బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ : కాటసాని

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

భారత రాజ్యాంగ నిర్మాత పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనంను ఈ నెల 19న సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కల్లూరు అర్బన్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో రూ.400 కోట్లతో అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృహత్తర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఎస్‌సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులతో కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిఎం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈనెల 9 నుంచి 12 వరకు నియోజక వర్గంలోని ప్రతీ మండలం, అర్బన్ లోని సచివాలయం పరిధిలో సమావేశాలు నిర్వహించి ఆ ప్రాంతంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలన్నారు.

10 నుంచి డప్పు సాంస్కృతిక ఉత్సవాలు

ఎపికెడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఆనంద్ బాబు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



డప్పు కళాకారులతో ఎండి.ఆనంద్‌బాబు

ఈనెల 10 నుండి 13 వరకు కర్నూలు జిల్లాలో జరిగే డప్పు పండగ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు మండలం పెద్దపాడులో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశానికి హాజరైన ఆనంద్ బాబు, జిల్లా నాయకులు ఎన్.చక్రపాణి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ డప్పు పండగ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే మొదటిదపాగా ఈనెల 10, 11న కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు డప్పు పోటీలను మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడులో నిర్వహిస్తున్నా మన్నారు. ఈనెల12, 13న గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, కౌతాళం మండలాలకు డప్పు పోటీలను ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహిస్తు న్నామన్నారు. పురాతన సాంప్రదాయ కళగా ఉన్న డప్పును సమాజం ముందు ఉంచి, డప్పు వాయిద్యాల కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కార దిశగా పాలకులకు ఎలుగెత్తి చాటేందుకే ఈ డప్పు సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘం గ్రామ నాయకులు కృష్ణ, దాసు, చిటికెల రాముడు, యేసు, చిరంజీవి, మద్దిలేటి, రత్నం, మునిస్వామి పాల్గొన్నారు.

కరువు మండలం కోసం కర్షకుల కన్నెర్ర

రైతుల భారీ ప్రదర్శన - టిడిపి, సిపిఎం, సిపిఐ , జనసేన, కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి-పత్తికొండ : అత్యంత వెనుకబడిన తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం పత్తికొండలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీ నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించేంతవరకు తమ ఆందోళన ఆగదంటూ రైతులు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టిడిపి పత్తికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ.శ్యాంబాబు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి, సిపిఎం తుగ్గలి మండల కార్యదర్శి శ్రీరాములు, సిపిఎం పత్తికొండ కార్యదర్శి రంగారెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సిజె. రాజశేఖర్ మాట్లాడారు. నిత్యం కరువు కాటకాలతో ఉన్న తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఉండకపోవడంతో ఇప్పటికే రైతు కూలీలు, వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. ఇప్పటికే రైతులు పంటలు చేతికి రాక పోవడం తో ఉన్న పశు వులను కూడ అమ్మే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికయినా తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్‌పిచైర్మన్ బత్తిన వెంకట రాముడు, మనోహర్ చౌదరి, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, రైతు సంఘం నాయకులు రంగరాజు, కొండారెడ్డి, శ్రీనివాసులు,ఉమామహేష్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసారు



మాట్లాడుతున్న కెఇ.శ్యాంబాబు, నిరసనలో ఆయా పార్టీల నాయకులు

ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వాలి



సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామంటున్న ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఉపాధికి నష్టం కలగకుండా నెలకు రూ.12,000 ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపిఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి పిఎస్.రాధాకష్ణ, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ జిల్లా నాయకులు మహమూద్ మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాలు నేపథ్యంలో కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత బస్సు వల్లనే అధికారంలోకి రావడంతో ఇక్కడ కూడా అదే విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రయాణికులే జీవనాధారంగా బతుకుతున్న ఆటో డ్రైవర్ల పరిస్థితి ఏంటి అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డీజిల్, పెట్రోలు సబ్సిడీతో ఇవ్వాలని, నెలకు రూ.12 వేలు ఇవ్వాలని, 50 యేళ్లు దాటిన ప్రతి డ్రైవర్‌కు ఐదువేల పింఛన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు విజయ్, ఆర్.నరసింహులు మాట్లాడారు. అనంతరం పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. సిపిఎం న్యూసిటీ నగర కార్యదర్శి టి.రాముడు సంఘీభావం తెలిపారు. ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గూడూరు రాజు, శ్రీరాములు, ఆటో యూనియన్ న్యూసిటీ ఓల్డ్ సిటీ అధ్యక్షులు రవి, తదితరులు పాల్గొన్నారు.

మొద్దు నిద్రతో క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: క్లాప్ డ్రైవర్లు సోమవారం 23వ రోజు సమ్మెలో పాల్గొని కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా మొద్దు నిద్రలో ఉన్న వైసిపి ప్రభుత్వం, రెడ్డి ఏజెన్సీ, మున్సిపల్ అధికారులు అంటూ నిద్రపోతూ నిరసన తెలిపారు. ఓల్డ్ సిటీ సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయి అధ్యక్షతవహించారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు సమ్మెలో కూర్చున్న క్లాప్ డ్రైవర్ కార్మికులనిర్దేశించి మాట్లాడుతూ గత 23 రోజులుగా మున్సిపల్ ఆఫీసు వద్దన్యాయమైన డిమాండ్లలను పరిష్కరిం చాలని కార్మికులు పోరాటం చేస్తుంటే వైసిపి ప్రభుత్వం, రెడ్డి ఏజెన్సీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా మొద్దునిద్ర పోతున్నారన్నారు. రెడ్డి ఏజెన్సీ కార్మికులకు గత 12 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కార్మికుల కుటుంబాల కడుపు మాడుస్తుంటే వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా రెడ్డి ఏజెన్సీ ఇచ్చే కమిషన్లకు ఆశపడి కార్మికులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ నగర కార్యదర్శి మైమూద్, సిఐటియు నగర నాయకులు కుమార్, క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు ఇస్మాయిల్, రఘు శేఖర్,రాజేష్,గౌడ్ చంద్రశేఖర్, పరమేష్, షఫీ, నవీన్,రవి,శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నగరకార్యదర్శి ఎం.రాజశేఖర్

తెలుగులో తీర్పు చెప్పిన జస్టిస్ భూపాల్ రెడ్డి

ప్రజాశక్తి -కర్నూలు లీగల్



కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి జి. భూపాల్ రెడ్డి సోమవారం రెండు తీర్పులను తెలుపులో వెలువరించడం చర్చనీయాంశమైంది. కేసును వాదించిన న్యాయవాది లోకేశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.... మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామ రైతు పి.ఆంజనేయులు తను పండించిన మిర్చి పంటను 2022 ఫిబ్రవరి9న అదే గ్రామానికి చెందిన కె.స్వామి రెడ్డి బోలెరో వాహనంలో గుంటూరుకు తీసుకుని వెళ్లి విక్రయించి తిరిగి ఫిబ్రవరి 11న అదే వాహనంలో తన స్వగ్రామానికి వస్తున్నారు. నందికొట్కూరు దాటిన తర్వాత దామ గట్ల దగ్గర ఉదయం 4.30ల సమయంలో ఎదురుగా వస్తున్న ఎపిఎస్ఆర్ టిసి బస్సు డ్రైవర్ దానిని అతి వేగంగా, అజాగ్రత్తగా నిర్లక్ష్యంతో నడుపుతూ సదరు బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రైతు ఆంజనేయులు, బొలెరో డ్రైవర్ స్వామి రెడ్డి చనిపోయారు. వారి మరణానికి కారణమైన ఎపిఎస్ఆర్‌టిసి వారు తమకు నష్ట పరిహారాన్ని ఇవ్వాలని భార్య, పిల్లలు తల్లిదండ్రులు కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో నష్టపరిహారం కోసం పిటిషన్ వేశారు. కేసులో జరిగిన విషయాలను , పత్రాలను పరిశీలించి జస్టిస్ జి.భూపాల్ రెడ్డి నూతన సంవత్సరంలో ఈ రెండు మోటారు వెహికల్ ఆక్సిడెంటు క్లెయిమ్ కేసులో తెలుగులో తీర్పు చెప్పారు. ఆంజనేయులు వారసులకు రూ.23,75,000, స్వామి రెడ్డి వారసులకు రూ.18,39,500 పిటిషన్ ఫైల్ చేసిన నాటి నుంచి డిపాజిట్ చేసే వరకు 7.5శాతం వడ్డీ , ఖర్చులతో పాటు ఆర్‌టిసి యాజమన్యం చెల్లించాలని ఆదేశించారు. కోర్టులు తీర్పులు తెలుగులో చెప్పడం వల్ల కక్షిదారులు న్యాయ వ్యవస్థకు మరి దగ్గర అవుతూ సరైన న్యాయం పొందుతారని న్యాయవాది లోకేశ్వరయ్య హర్షం వ్యక్తం చేశారు.



టిడిపి విజయానికి కష్టపడాలి: టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ విజయానికి అందరూ సమిష్టిగా కష్టపడాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి భరత్ అన్నారు. సోమవారం కర్నూలు మౌర్య ఇన్‌లో 50వ వార్డుకు చెందిన రజకులు.. కర్నూలు సిటీ రజక యూత్ అధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. తన గెలుపు వల్ల కర్నూలు మొత్తం బాగుపడుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో చిన్న, హరి, షాలు, శ్రీనివాస్, మహేష్, శివ, మధు, చంటి, శీను, బన్నీ, అఖిల్, అంజి ఉన్నారు. రజక యూత్ నేతలు బాల్‌రాజ్, వార్డు నేతలు రంగారెడ్డిఉన్నారు.

పాలిటెక్నిక్ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆగిన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలను రెసిడెన్షియల్‌గా మార్చాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో నిరసన చేపట్టి, తహశీల్దార్ రామాంజినేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆలూరులో సాంకేతిక విద్యనందించాలని 2008లో పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సొంత భవనం లేక స్థానిక ప్రభుత్వ బాలుర-1 ఉన్నత పాఠశాలలోని అదనపు తరగతి గదుల్లో విద్యాభ్యసిస్తున్నారని చెప్పారు. ఐదేళ్ల క్రితం కళాశాల భవన నిర్మాణానికి ఓ దాత ఐదెకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారని, ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేయడంతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారని తెలిపారు. నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.5.90 కోట్ల వరకు ఖర్చు చేశారని, ఇందులో కేవలం రూ.1.50 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరయ్యారని చెప్పారు. మిగతా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. పెండింగ్ నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, షఫీ, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, భరత్, విజయ్, జశ్వంత్, హరికృష్ణ, ఉదయ్, మంజునాథ్, గణేష్, సాయికుమార్, ఉచ్చీరంగ పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ
- 28వ రోజూ అంగన్వాడీల దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, అధ్యక్షులు రామాంజినేయులు, ఎఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, పద్మ, జానకి అధ్యక్షతన ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరవధిక దీక్షలు చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, అడ్వకేట్, బిజెపి మహిళా నాయకులు సావిత్రి దీక్షలకు మద్దతు పలికి మాట్లాడారు. అంగన్వాడీల నిరసనలను నీరుగార్చేందుకు వివిధ రకాల జిఒలు రిలీజ్ చేస్తూ చివరకు ఎస్మా చట్టాన్ని తీసుకు రావడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. సోమక్క, గీత, రేణుక, సోమేశ్వరి, శారద, గౌసియా, గీతా పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన సమ్మె 28వ రోజుకు చేరుకుంది. ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు థామస్ మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు అంజి, రాజు, అంగన్వాడీలు ప్రమీల, ద్రాక్షాయని, ఉమామహేశ్వరి, లావణ్య, హంసిరా బేగం, చిలకలదొన ఇందిరమ్మ, మరియమ్మ, సుందరమ్మ, పద్మ, సరిత పాల్గొన్నారు. **కోసిగి**లో భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) మండల నాయకులు హెచ్చిబానీ, లూసమ్మ, వరలక్ష్మి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు లలితమ్మ, లత, యు.లక్ష్మి, సరోజ, శైలజ, సంగీతమ్మ, ఈరమ్మ, పద్మ, భాగ్యవతి, అంజనమ్మ పాల్గొన్నారు. **కౌతాళం**లో 28వ రోజు సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విజయలక్ష్మి పాల్గొన్నారు. **ఆలూరు**లో 28వ రోజు సమ్మెలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్ మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ, భారతి, పుష్పవతి, లక్ష్మీ, సరస్వతి, ప్రభావతి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో చేపట్టిన దీక్షలు 28 రోజుకు చేరాయి. దీక్ష శిబిరం నుంచి ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అలాగే సరుకుల పంపిణీ వాహనాన్ని అడ్డుకున్నారు. అంగన్వాడీ యూనియన్ సెక్టార్ ప్రధాన కార్యదర్శి గోవర్ధనమ్మ, పట్టణ నాయకులు నాగలక్ష్మి, శైలజ, శిరోమణి, కృష్ణవేణి, గోనెగండ్ల మండల నాయకులు నీరజ, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి వి.తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడీలు గాయత్రి, నాగేశ్వరమ్మ, బసమ్మ, అరుణ, తులసి, మేరీ, అత్తర్ భాను, బండ లత, మహేశ్వరి, శారద, బజారమ్మ, జయమ్మ పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో అంగన్వాడీల నిరవధిక సమ్మె 28వ రోజు జిఒ 2 ప్రతులను దహనం చేశారు. సిఐటియు మండల గౌరవాధ్యక్షులు తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, థెరిస్సమ్మ, శారద, అరుణ పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడు తున్న గుడిసె కృష్ణమ్మ

టిడిపితోనే బీసీల అభివృద్ధి : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్



దైవందిన్నెలో మాట్లాడుతున్న బీవీ

రాష్ట్రంలో బీసీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దైవందిన్నె గ్రామంలో 'జయహో బీసీ'ని టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్, బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. ఎన్నికల సమయంలో మాత్రమే వైసిపికి బీసీలు గుర్తుకొస్తారని, బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, నాగేష్, నాగరాజు, డీలర్ ఈరన్న, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

చెట్నిహాల్లిలో సిసి రోడ్లకు భూమి పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం



భూమిపూజ చేస్తున్న నాయకులు

మండలంలోని చెట్నిహాల్లి గ్రామంలో రూ.65 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్లకు టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి భూమి పూజ చేశారు. సోమవారం గ్రామం చేరుకున్న ఆయనకు సర్పంచి అంజినయ్య, ఉప సర్పంచి వీరనాగప్ప, ఎంపిటిసి రామాంజినేయులు, మాజీ ఉప సర్పంచి అల్లింగప్ప, మాజీ సర్పంచి గంగుల పార్వతమ్మ భర్త, వైసిపి నాయకులు గంగుల వెంకటేష్, ఆయన కుమారుడు మల్లికార్జున శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టి పారతో తవ్వి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'గడపగడపకు' నిధులతో రెండు సిసి రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇటీవల ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, పిఆర్ ఎఇ నరసింహులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.

'వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి'

ప్రజాశక్తి - చిప్పగిరి

పశు పోషణలో ఉన్న ప్రతి రైతు కూడా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి ప్రసన్నబాయి సూచించారు. సోమవారం మండలంలోని రామదుర్గం గ్రామంలో లంపీ స్కిన్ (ముద్ద చర్మం, లేదా బొడ బొబ్బలు) వ్యాధి నివారణకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ టీకాలను పశువులకు వేశారు. అనంతరం గ్రామంలోని పాడి రైతులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులు, గొర్రెలు, మేకలకు రోగ నిరోధక శక్తిని పెంచే మందులను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. పశువులకు జ్వరం, ఆయాసం, పుండ్లు ఇతర ఆరోగ్య సమస్యలు వస్తే అశ్రద్ధ చేయకుండా పశు వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

గ్రూపు విభేదాలతో రాజీనామా

- టిడిపి సీనియర్ నేత నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు



ఆలూరు టిడిపిలో గ్రూపు విభేదాల కారణంగా ప్రతి సారీ టిడిపి అభ్యర్థి ఓటమి పాలవుతున్నారని, ఈ సారి కూడా ఇదే జరుగుతుందని, సెకండ్ కేడర్ దెబ్బతింటుందని, అందువల్లే తాను పార్టీలో ఉండలేనని, రాజీనామా చేస్తున్నట్లు తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలూరులోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లుగా పార్టీలో గ్రూపు విభేదాలతో నలిగి పోయామని తెలిపారు. దీనిపై అధిష్టానం దృష్టి సారించడం లేదన్నారు. ఆలూరులో నలుగురు ఇన్‌ఛార్జీలు ఉన్నా వారిలో ఐక్యత లేక కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో బలమైన పార్టీగా ఉంటున్నా అధిష్టానం దృష్టి సారించకపోవడంతో ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తు కార్యకర్తలను అయోమయంలోకి నెట్టేస్తున్నారన్నారు. అందుకే విరక్తి పుట్టి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

వైసిపి అభ్యర్థి వెంకటేష్‌ను గెలిపించాలి

- వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు వైసిపి అభ్యర్థి మాచాని వెంకటేష్‌ను సమిష్టి బాధ్యతగా గెలిపించుకుంటామని వైసిపి నేత ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాచాని వెంకటేష్, నియోజకవర్గ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచన మేరకు ఎమ్మిగనూరు సీటు బీసీలకు కేటాయించారని తెలిపారు. తమ కుటుంబంపై ఉన్న నమ్మకం, అభిమానంతో పార్టీలోని కొందరు నాయకులు తనకు, లేదా తమ తండ్రి చెన్నకేశవ రెడ్డికి సీటు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. బీసీ అభ్యర్థికి సహకరించాలని, మాచాని వెంకటేష్ వద్దని, అది తామే చేయిస్తున్నామని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారని అన్నారు. మాచాని వెంకటేష్‌ను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. వైసిపి నాయకులు డాక్టర్ రఘు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, ఎంపిపి గొల్ల కేశన్న, టౌన్ బ్యాంకు ఛైర్మన్ కొమ్ము రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, కదిరికోట సునీల్ కుమార్, రియాజ్ అహ్మద్, కోటేకల్ లక్ష్మన్న, కడివెళ్ల రంగస్వామి, వెంకట రామ రెడ్డి, పెద్దయ్య, వాహీద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి



క్రీడా సామగ్రిని అందజేస్తున్న నాయకులు

యువత క్రీడల్లో రాణించాలి

- వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి

ప్రజాశక్తి - కౌతాళం

యువత క్రీడల్లో రాణించాలని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి సహకారంతో గ్రామంలోని యువకులకు సుమారు రూ.50 వేలతో క్రికెట్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. యువత మధ్య స్నేహభావం పెంపొందించడమే కాకుండా శారీరక దృఢత్వానికి క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి తమ వంతు సహకారంగా సామగ్రిని అందజేసినట్లు చెప్పారు. చౌదరి బసవ, ఉప సర్పంచి సక్కరి తిక్కయ్య, ఛైర్మన్ వడ్డే రామన్న, మాజీ సర్పంచి అవతారం, నాయకులు ఉమాపతి, భీమేష్, సమ్మద్, రాజ్ అహ్మద్, వార్డు సభ్యులు రామకృష్ణ, సుమన్, యాలీ ఖాసీం, ఎన్‌టిఆర్ నగర్ బాషా పాల్గొన్నారు.

సచివాలయాల అధికారులను
అడ్డుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నందవరం

అంగన్వాడీలు సమ్మెలో ఉండగా కేంద్రాన్ని సచివాలయ ఉద్యోగులు తెరిచి, కిట్లను పంపిణీ చేస్తున్నారని తెలియడంతో వర్కర్లకు మద్దతుగా సిపిఎం నాయకులు పంపిణీనీ అడ్డుకున్నారు. సోమవారం నాగలదిన్నె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-5ను మహిళ కానిస్టేబుల్ ఉషారాణి తెరిచి కిట్లను పంపిణీ చేస్తుండగా అక్కడికి వెళ్లి మండల నాయకులు ఎల్లేష్ కార్యకర్తలతో కలిసి అడ్డుకున్నారు. అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని 28 రోజులుగా సమ్మె చేస్తుంటే, సచివాలయ ఉద్యోగులొచ్చి కేంద్రాన్ని తెరిచి కిట్లను పంపిణీ చేయడం అన్యాయమన్నారు. కార్మికులు, ఉద్యోగులు అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్నారని, సచివాలయ ఉద్యోగులు సహకరిస్తే అంగన్వాడీ సమస్యలు తీరుతాయని తెలిపారు. సిపిఎం కార్యకర్తలు రవి, నాగేష్, కొండన్న, సంతోష్, సుంకప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.

విమర్శలను పట్టించుకోం...

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- రూ.33 కోట్లతో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నడూ జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వైసిపి హయాంలో జరిగాయని, ఇంకా జరుగుతూనే ఉంటాయని, ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, వాటిని పట్టించుకోమని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో రూ.33 కోట్లతో మున్సిపల్ షాపింగ్ నిర్మాణానికి మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను గత నాలుగున్నర ఏళ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఆదోనికి మెడికల్ కళాశాలను మంజూరు చేసి నిర్మిస్తున్నామని, బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. పట్టణంలోని ఆస్పత్రులను అభివద్ధి చేశామని, డిగ్రీ కళాశాలను ప్రారంభించామని తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ కోసం 2004లోనే తాను బస్టాండ్‌ను ఖాళీ చేయించి నిర్మాణానికి చర్యలు చేపడితే, తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మళ్లీ నిర్మాణం చేపట్టామని చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ రాధాకృష్ణ, కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్, వ్యాపార వేత్త దాసరి శంకర్ రావు ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో రూ.1.85 కోట్లతో నిర్మించిన కొత్త పిహెచ్‌సిని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో స్థల దాతలు కీర్తిశేషులు హెచ్.రామ్మూర్తి ఆచారి, హెచ్.రాఘవేంద్ర ఆచారి అప్పట్లోనే ఆస్పత్రి కోసం స్థలం కేటాయించడం గర్వంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైస్ ఛైర్మన్ మజర్ అహ్మద్, సర్పంచి రాము, ఆర్అండ్‌బి ఇఇ కృష్ణారెడ్డి, డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ రవికాంత్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, మాజీ సర్పంచులు ఆదినారాయణ రెడ్డి, రాఘవేంద్ర ఆచారి, కాంట్రాక్టర్ ఓబుల్ రెడ్డి, తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి, పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దహరివాణం, జాలమంచి గ్రామాల్లో సిసి రోడ్డు, తారురోడ్డు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. 'గడపగడపకు'లో పెద్దహరివాణం గ్రామానికి మంజూరైన రూ.12 లక్షలతో సిసి రోడ్లను ప్రారంభించినట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దు ఇటికల్ గ్రామం నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు సుమారు 6 కిలోమీటర్లు రూ.3 కోట్లతో తారు రోడ్లు వేస్తున్నామన్నారు. పంచాయతీరాజ్ డిఇ ఖాదర్ బాష, ఎఇ మాలిక్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

అనుమతి లేకుండా పంచాయతీ భవనం కూల్చివేత

- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని విరుపాపురం గ్రామంలో సర్పంచి సిద్ధమ్మ తనయుడు మోకామల్లి ఎలాంటి అనుమతి లేకుండా, గ్రామసభ నిర్వహించకుండా పాత పంచాయతీ భవనాన్ని కూల్చేశారని గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో 30 ఏళ్ల క్రితం పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారని తెలిపారు. గ్రామసభలు, గ్రామ కార్యక్రమాలు నిర్వహించేందుకు పంచాయతీ కార్యాలయం ఉపయోగపడిందని చెప్పారు. ఇలాంటి కార్యాలయాన్ని గ్రామంలో ఉన్న వార్డు మెంబర్లకు కానీ, ఉన్నతాధికారులకు కానీ సమాచారం ఇవ్వకుండా, పంచాయతీ చట్టం ప్రకారం అనుమతులు తీసుకోకుండా సర్పంచి తనయుడు మోకామల్లి పంచాయతీ భవనాన్ని కూల్చేశారని తెలిపారు. మోకా మల్లిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచి నేత్రావతి, వార్డు సభ్యులు, ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, ప్రజలు కోరారు. స్పందించిన అధికారులు పంచాయతీ భవనం కూల్చివేతపై విచారించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచి, రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని పంపు హౌస్ వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

హామీలను నెరవేర్చింది జగనే

- వైసిపి నాయకుల హంపిరెడ్డి

ప్రజాశక్తి-దేవనకొండ

ఇచ్చిన హామీలను నెరవేర్చినది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినేనని వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షులు, వైసిపి నాయకులు హంపిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నేలతలమరి గ్రామంలో కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టారు. వైసిపి నాయకులు జయరామ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల నష్టపోయే ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు బి.మహానంద రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రిక్రియేషన్ క్లబ్ గ్రౌండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరోనా సమయంలో ఆటో డ్రైవర్లు నష్టపోయినా ప్రభుత్వం ఎలాంటి సహాయమూ చేయలేదని, వెహికల్ సవరణ చట్టంలో భాగంగా జిఒ 21 తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. ఇప్పుడు ఈనెల 14 నుంచి (సంక్రాంతి) మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీనివల్ల ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు జీవనాధారం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోయే ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని, జిఒ 21ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇస్తున్న వాహన మిత్ర పథకాన్ని రూ.20 వేలకు పెంచి లైసెన్స్ కలిగి ఉన్న ప్రతి ఆటో కార్మికునికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోవిందు, రామాంజనేయులు, షేకన్న, రమేష్, రవి, వెంకటేశులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం ముందు రాజు అధ్యక్షతన ఎపి ఆటో, ట్రాలీ, అండ్ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తహశీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.గోవిందు, బి.రాముడు, ఎపి రైతు సంఘం నాయకులు అబ్దుల్లా మాట్లాడారు. సిఐటియు నాయకులు రమేష్, రాజు, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, ఆటో యూనియన్ నాయకులు కృష్ణ, షబ్బీర్, దాసు, మెహబూబ్ పాల్గొన్నారు. **ఆలూరు**లో కొత్తబస్టాండ్ నుంచి ఆటోడ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన రహదారి గుండా నినాదాలతో ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తహశీల్దార్ రామంజినేయులుకు వినతిపత్రం అందజేశారు. ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు డి.తిమ్మప్ప, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, సుంకప్ప, శ్రీనివాసులు, విజయ్, సద్దాం, ఎల్లప్ప, శెట్టి, జానీ, రాముడు, వెంకీ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

9న ఆదోనిలో భువనేశ్వరి బస

ప్రజాశక్తి - ఆదోని

'నిజమే గెలవాలి'లో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి కర్నూలు జిల్లా పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు పర్యటన నేపథ్యంలో 9న ఆదోనిలోని చేకూరి ఫంక్షన్ హాలులో బస చేయనున్నారు. సోమవారం టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో కలిసి నారా ప్రశాంత్, బాపట్ల శ్రీధర్, రాబిన్ శర్మ టీమ్ సభ్యులు ఫంక్షన్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు. టిడిపి నాయకులు బసాపురం రామస్వామి, రంగస్వామి నాయుడు, మదిరే లోకనాథ్ రెడ్డి, యువ నాయకులు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీం సభ్యులు



వినతిపత్రం ఇస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ముస్లిం, మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న ముస్లిం, మైనార్టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిజిఎల్ కాలనీ నుంచి మైనార్టీ కాలనీ వరకు రోడ్డు సౌకర్యం, వీధిలైట్లు, డ్రెయినేజీలు, ఉర్దూ పాఠశాలకు స్వంత భవనం తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. వారానికి ఒకసారైనా శుభ్రం చేయాలని, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, తాగునీటి పైపులైను వేయాలని కోరారు. టిడిపి నాయకులు వడ్డేమాన్ గోపాల్, సైనుల్లా, అల్తాఫ్, రాఘవేంద్ర రెడ్డి, జిలాన్, ఖాదర్ బాష, భరత్, వీరేష్, రాజు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో భీమా యూత్ సభ్యుల ఆధ్వర్యంలోని సచిన్ లెవెన్ క్రికెట్ జట్టుకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహాయ, సహకారంతో క్రీడా దుస్తులను సోమవారం వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని, గ్రామానికి వన్నె తీసుకు రావాలని సూచించారు. ఎంపిపి ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నరసింహులు, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్, మహంతేష్ స్వామి, మంగమ్మ, ఎన్.నాగరాజు, బసిరెడ్డి, బుళ్లి నరసింహులు, హోళగుంద కోసిగయ్య, నరసింహులు గౌడ్, దొడ్డి నర్సన్న, కాంట్రాక్టు నాగరాజు, మల్లికార్జున గౌడ్, సాతర్ల ఉరుకుందప్ప, కందుకూరు తాయన్న, కందుకూరు మల్లయ్య, మూగలదొడ్డి సోమేష్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న మురళీ మోహన్ రెడ్డి

'దోభీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ శాఖలో, దేవాలయాల్లో దోభీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కన్న, ఉద్యోగుల సంఘం కన్వీనర్ సిద్ధప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని శాంతి మల్లప్ప చెరువు వద్ద ఉరుకుంద అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, లాండ్రీ షాపులకు ఉచితంగా 250 యూనిట్ల వరకు పెంచాలని కోరారు. ఇంటి దగ్గర పనిచేసే వారికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న చేదోడు ల్యాండ్ షాపులతోపాటు ఇంటి దగ్గర పని చేసే వారికి కూడా వర్తించాలని కోరారు. రజకుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, దోభీ ఘాట్లపై రజకులకు పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. రజక సంఘ పట్టణ అధ్యక్షులు రామన్న, ఉద్యోగ సంఘం నాయకులకు గోవిందప్ప, పట్టణ నాయకులు మల్లయ్య, ఎర్రిస్వామి, ప్రకాష్, నాగరాజు, సూరి, కుమార్ రాజు, రఘు, హుసేని పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో జగన్ వాటా ఎంత

- సమతా సైనిక్ దళ్ రాయలసీమ కన్వీనర్ రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటులో జగన్మోహన్ రెడ్డి వాటా ఎంత, దళితులపై ప్రేమతో కాదని, దళిత ఓట్ల కోసమే విగ్రహం ఏర్పాటు చేశారని సమతా సైనిక్ దళ్ రాయలసీమ కన్వీనర్ సి.రంగయ్య విమర్శించారు. సోమవారం పట్టణంలోని గెస్ట్ హౌస్‌లో జై భీమ్ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మల్లేష్, యువదళం జిల్లా అధ్యక్షులు నల్లన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడారు. ఈనెల 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేపట్టనున్న జగనన్నకు రంగయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లకైనా దళితులు గుర్తుకొచ్చినందుకు సంతోషకరమని చెప్పారు. విగ్రహ నిర్మాణ శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు చేసి చంపి డోర్ డెలివరి చేసిన నాయకులను ప్రోత్సాహిస్తూ పైకి 'నా ఎస్సీ, ఎస్టీలు' అంటూ దళితులపై ప్రేమ ఉన్నటు నటిస్తూ వెన్నుపోటు పొడుస్తున్నారని విమర్శించారు. జై భీమ్ మాలమహానాడు నాయకులు పరమేష్, నాయకులు బలరాం రాముడు పాల్గొన్నారు.

'నిష్పక్షపాతంగా వ్యవహరించాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల ప్రక్రియలో సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఎస్పీ శివ నారాయణస్వామి తెలిపారు. సోమవారం కాన్ఫరెన్స్ హాలుల్లో ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

'మాజీ సైనికునికి న్యాయం చేయండి'

ప్రజాశక్తి-ఆలూరు

మాజీ సైనికుడు మహేష్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తగ్గించి మరో వ్యక్తి భూమిలో కలిపారని, ఈ విషయంపై ముఖ్యమంత్రి నుంచి తహశీల్దార్ వరకూ ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, న్యాయం చేయాలని డిఫెన్స్ వెటరన్స్ ఆర్గనైజేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసులు, బాధితుడు మహేష్ కోరారు. సోమవారం కలెక్టర్ డాక్టర్ సృజన, ఎంపీ సంజీవ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2011లో 2.96 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, రెవెన్యూ అధికారులు 53 సెంట్లను గుండప్ప అలియాస్ ప్రభాకర్ భూమిలో కలిపారని తెలిపారు. ఈ విషయంలో న్యాయం చేయాలని విన్నవించినా న్యాయం జరగడం లేదన్నారు. గతంలో పలుమార్లు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఆలూరు తాలూకా అధ్యక్షులు శివ ప్రసాద్, రామాంజినేయులు, వెంకటేశ్వర్లు, ఖాజా హుస్సేన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

జూనియర్ ఎన్‌టిఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆస్పరి : జూనియర్ ఎన్‌టిఆర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆస్పరిలో ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ మండల అధ్యక్షులు వీర చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మట్లాడారు. సినీ పరిశ్రమలో అభిమానులను దగ్గరకు తీసుకొని ఆప్యాయంగా మాట్లాడించే వ్యక్తి జూనియర్ ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ట్రిపుల్ ఆర్ వంటి హిట్ సినిమా తీసి అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. దేవర సినిమా కూడా హిట్ కొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారని తెలిపారు. ఫ్యాన్స్ రవి, నాగేంద్ర, మహానంది, నరసప్ప, మురళీ, గోవర్ధన్, వీరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి



మంగళవారం 9 జనవరి 2024



బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ తదితరులు

హామీలు అమలు చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు
- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, పాదయాత్రలో, అసెంబ్లీ సాక్షిగా సిఎం జగనన్న ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లావ్యాప్తంగా తరలి వచ్చిన మున్సిపల్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు స్థానిక నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. సిఎం మొండి వైఖరి నశించాలంటూ మున్సిపల్ కార్మికులు నినదించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు భాస్కరచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎ.నాగరాజు మాట్లాడుతూ విభజించు పాలించు పద్ధతిలో బ్రిటీష్ పాలనను పోలిన పాలనను సిఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని అన్నారు. స్వచ్ఛ భారత్, పారిశుధ్య కార్మికులు నమ్మి ఓట్లు వేస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సిఎం కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. డోన్‌లో 10 మంది కార్మికులు చనిపోతే వారి పిల్లలను చేర్చుకోవడం లేదని, ఇతరులకు అవకాశాలు ఇస్తున్నారని సిఎంపై మండిపడ్డారు. ఏళ్ల నుండి పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల గురించి సిఎం జగన్ పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న పట్టణాల జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేరని, ఉన్న కార్మికులు పని భారంతో అల్లాడిపోతున్నరని చెప్పారు. రూ. 270 కోట్లు ఇస్తే మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించవచ్చున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఏసురత్నం మాట్లాడుతూ కార్మికులు జీతాలపైనే ఆధారపడి బతుకుతున్నారని, 5 సంవత్సరాలకు ఒక్కసారి జీతాలు పెంచుతామంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు అవసరమైనప్పుడు వారి వేతనాలు పెంచుకోవచ్చని, ఒక్కసారి ఎమ్మెల్యే అయితే జీవితాంతం పెన్షన్ ఇవ్వొచ్చు కానీ కార్మికులకు జీతాలు **మిగతా 6వ పేజీలో...**

నేడు ఆళ్లగడ్డకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నేడు ఆళ్లగడ్డ పట్టణానికి రానున్నారు. తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో జరిగే బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. పట్టణంలోని బిబిఆర్ పాఠశాలకు ఎదురుగా ఉన్న మైదానంలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి 3.45 గంటల వరకు బహిరంగ సభ జరగనుంది. బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నంద్యాల పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజక వర్గాల ఇన్చార్జిలు ఈ సభలో పాల్గొననున్నారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలో జరిగే ఈ బహిరంగ సభకు లక్ష మంది పాల్గొనే విధంగా టిడిపి నాయకులు కసరత్తు చేశారు. బహిరంగ సభ ప్రాంగణాన్ని మాజీ మంత్రి భూమా అఖిలప్రియతో కలిసి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సోమవారం పరిశీలించారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

- జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులపై తక్షణమే స్పందించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్-ఎల్ఎలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీత కాలవ్యవధిలో గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో 265 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవిన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టిన దృశ్యం

అంకిరెడ్డి చెరువులో

ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు

- రాత్రి వేళ టిప్పర్ల ద్వారా రవాణా - చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లె గ్రామ సమీపంలోని అంకిరెడ్డి చెరువులో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అర్ధరాత్రి సమయాల్లో పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అతివేగంగా ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. ఎర్రమట్టి టిప్పర్ల ద్వారా రవాణా చేసేటప్పుడు ఏమైనా ప్రమాదం సంభవిస్తే దీనికి ఎవరు బాధ్యులని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అక్రమ ఎర్రమట్టి రవాణా దర్జాగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఎర్రమట్టి ఇటుక బట్టీలకు, వెంచర్లకు తరలిస్తూ అక్రమంగా అమ్ముకుంటూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. వైసిపి నాయకులు సహజ వనరులను తరలించుకుపోతున్నా, చెరువులలో మట్టి ఖాళీ అవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రమట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయో లేదో అధికారులకే తెలియాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు స్పందించి అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎర్రమట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం
- జనార్ధన్ శెట్టి, తహశీల్దారు, మహానంది.



మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని అంకిరెడ్డి చెరువులో ఎర్రమట్టి అక్రమ రవాణా గురించి సమాచారం తెలుసుకున్నాం. వెంటనే పోలీస్, మైనింగ్, రెవిన్యూ తదితర శాఖల అధికారులను అప్రమత్తం చేసి ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశాము. ఎన్ఒసి లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు ఎవరైనా జరిపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలు సీజ్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

10న సిఎం కార్యాలయం ముట్టడి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న సిఎం కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్, పట్టణ కార్యదర్శి శివలు తెలిపారు. డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పి మడమ తిప్పారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిఎస్సి అభ్యర్థులు అనేకసార్లు నిరసనలు, ధర్నాలు చేసినప్పటికీ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ముట్టడించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 10వ తేదీ ఈ ప్రభుత్వంతో తాడోపేడో తెలుసుకోవడానికి చలో సీఎం కార్యాలయం ముట్టడిని తప్పనిసరి పరిస్థితుల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ముట్టడిలో ఏం జరిగినా సరే దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా మెగా డీఎస్సీ విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రంలోని 10 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల సత్తా ఏమిటో జగన్మోహన్ రెడ్డికి రుచి చూపిస్తామన్నారు. నిరుద్యోగులందరూ సిఎం కార్యాలయం ముట్టడిలో పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ మెడలు వంచి మెగా డీఎస్సీ సాధించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు హరిబాబు, రవీంద్ర సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

28వ రోజు అంగన్‌వాడీల సమ్మె

- పగిడ్యాలలో కర్నాటక రాజ్యసభ సభ్యుడికి వినతి
- నంద్యాలలో రిలే దీక్షలకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘీభావం
- బండి ఆత్మకూరులో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మద్దతు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 28వ రోజు సోమవారం కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. పగిడ్యాలలో కర్నాటక రాజ్యసభ సభ్యుడు ఈరన్న కడాడి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌లకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. బండి ఆత్మకూరులో సమ్మెకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. నందికొట్కూరులో ఒంటికాలిపై నిలబడి దండం పెట్టారు. బేతంచెర్లలో 28 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు.

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు సంజీవయ్య ప్రారంభించి మాట్లాడారు. అంగన్వాడీలు గత 28 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ మాట్లాడుతూ **మిగతా 6వ పేజీలో...**



బండి ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్ రెడ్డికి వినతి అందజేస్తున్న అంగన్‌వాడీలు



కొత్తపల్లి లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

అవ్వతాతల్లో
వెల్లివిరిసిన ఆనందం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్.

నూతన సంవత్సరంలో 2,750 నుండి 3000 వరకు పింఛన్ రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో అవ్వతాతల కళ్ళల్లో ఆనందం వెల్లువిరిసిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపిడిఓ సుగుణ శ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై 7,118 మంది లబ్ధిదారులకు రూ. 3 వేలు పింఛన్, కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్ ,మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ విజయశేఖర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్‌లు పాల్గొన్నారు. **మహానంది :** మహానంది గ్రామంలోని శాలివాహన సత్రంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం నాయకులు అధికారుల చేతులమీదుగా పింఛన్ లబ్ధిదారులకు 3 వేల నగదు అందజేశారు. తహశీల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపిడిఓ శివ నాగజ్యోతి, మహానంది ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, జెడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, వైసీపీ మండల నాయకులు భూమా సుబ్బరామయ్య, వాలంటరీలు పాల్గొన్నారు.

పలుకూరి బాషాపై
కఠిన చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఫిర్యాదు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అంగన్వాడి వర్కర్లను దుర్భాషలాడిన బెలూం గ్రామానికి చెందిన పలుకూరు బాషాపై కఠిన చర్యలు తీసుకోవాలని అంగన్వాడి వర్కర్ల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడి వర్కర్లు తాసిల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పలుకూరి బాషాపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంగన్వాడి వర్కర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిఐటియ నాయకులు దావీదు, అంగన్వాడి వర్కర్లు పద్మావతి, శ్రీదేవి, రేణుక, లీలావతి, ప్రభావతి, భాగ్యలక్ష్మి, వసుంధర, మహాలక్ష్మి, సరిత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు, పేదల కోసం అనేక పథకాలు

- భారత ప్రధాని నరేంద్ర మోడీ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి
- వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం

ప్రజాశక్తి - పగిడ్యాల

దేశ ప్రజల కోసం, రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని వీడియోకాన్ఫరెన్స్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సోమవారం పగిడ్యాల మోడల్ స్కూల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక రాజ్యసభ సభ్యుడు ఈరన్న కడాడి హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో వివిధ శాఖల ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారంలో పగిడ్యాల సింగిల్ విండో సిఇఒ ఖాజామొద్దీన్‌తో ముఖాముఖి మాట్లాడారు. మండలంలో రైతులకు, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అమలు చేశారని ప్రధాని అడిగారు. ఖాజామొద్దీన్ మాట్లాడుతూ మండలంలో దాదాపు రూ.3.15 కోట్లతో రైతులకు ధాన్యం భద్రపరుచుకునేందుకు గోధాములు నిర్మించామని తెలిపారు. పగిడ్యాల వ్యవసాయ పరపతి సంఘం సంస్థ 1921లో ప్రారంభమైందని, దాదాపు 5,600 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. రైతులకు గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్లు తదితర వాటికి రుణాలు అందజేసినట్లు తెలిపారు. సొసైటీ ద్వారా చిన్న సన్న కారు రైతులకు రుణాలు ఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునిచ్చినట్లు ప్రధానికి వివరించారు. ముఖాముఖి ముగిసిన అనంతరం రాజ్యసభ సభ్యులు ఈరన్న కడాడి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన రైతులకు, నిరుపేదలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడమే వికసిత్ భారత సంకల్పయాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతకుముందు బిజెపి జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరిని వేదికపైకి పిలవకపోవడంతో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిపిఒ మంజులవాణిని నిలదీశారు. తక్షణమే డిపిఒ జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బైరెడ్డి శబరిని వేదికపైకి పిలిచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ కార్యదర్శి లలిత్ కుమార్, జిల్లా కలెక్టర్ మంజీర్ జిలానీ సామూన్, డిఎంహెచ్ఒ వెంకటరమణ, హౌసింగ్ పిడి వెంకట సుబ్బయ్య, ఆర్డిఒ దాసు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, కెడిసిసి చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఎంఇఒ సుభాన్, సిడిపిఒ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మహిళలను బలవంతంగా కూర్చోబెట్టిన వైనం

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి హాజరైన మహిళలు కొద్దిసేపటి తర్వాత ఒకరి తర్వాత ఒకరు బయటకు వెళ్లిపోవడంతో అధికారులందరూ అడ్డుకొని కూర్చోవాలని చెప్పారు. అయినా మహిళలు వెళ్ళిపోతుండడం తో ఎపిఎం శ్రీనివాసులు గట్టిగా వాదించి కూర్చోబెట్టారు.



కార్యక్రమంలో పాల్గొన్న కర్ణాటక రాజ్యసభ సభ్యుడు ఈరన్న కడాడి, జిల్లా కలెక్టర్ తదితరులు

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా గోగిశెట్టి నరసింహారావు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ



టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా సిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది గోగిశెట్టి నరసింహారావును నియమించారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుండి 18 మందిని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులుగా, రాష్ట్ర కార్యదర్శులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు నియమించారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి హైకోర్టు సీనియర్ న్యాయవాది గోగిశెట్టి నరసింహారావును రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమించారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన గోగిశెట్టి హైకోర్టు న్యాయవాదిగా రాణించడమే కాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు టిడిపి జాతీయ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు గోగిశెట్టి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేసేందుకు కృషి చేస్తానన్నారు.

మద్దిగుంట చెరువు నీటి చౌర్యాన్ని అరికట్టండి

- కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మద్దిగుంట చెరువు నుండి సుంకేసుల, చింతలపల్లె గ్రామాలకు చెందిన నాన్ ఆయకట్టు రైతులు నేరుగా చెరువు నుండి అక్రమంగా నీటి చౌర్యం చేస్తున్నారని, వెంటనే అరికట్టాలని బాధిత రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. మిడుతూరు మండలం జలకనూరు గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నాన్ ఆయకట్టును అరికట్టాలని, జలకనూరు మద్దిగుండం చెరువు నుండి నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు గుండం శివరామిరెడ్డి, కాతా మనోహర్ రెడ్డి, హరి సర్వోత్తమ రెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్ బాబు తదితరులు మాట్లాడుతూ చెరువుకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా స్పందించడం లేదన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్దతుగా పాల్గొన్న ఎపి రైతు సంఘం నేతలు : ఈ ఆందోళనకు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మద్దిగుండం చెరువు రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, నాన్ ఆయకట్టును అరికట్టాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న బాధిత రైతులు, మద్దతుగా పాల్గొన్న నాయకులు

ఎస్ఎస్ఎ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి : జెవివి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాలలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె సోమవారం 20వ రోజు కొనసాగింది. ఈ సమ్మెలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు సంఘీభావంగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే అతి ముఖ్యమైన విద్యాశాఖలో కాంట్రాక్టు వ్యవస్థ ఉండడం దారుణమన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు హిదాయతుల్లా, కాంతారావు, నీరజ, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, నాగమణి, లింగమయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రానున్న ఎన్నికల్లో బిసిల సత్తా చూపిస్తాం : టిడిపి

- జయహో బిసి ప్రచార రథాలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రానున్న ఎన్నికల్లో బిసిల సత్తా చూపిస్తామని, టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జయహో బిసి ప్రచార రథాలను బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, రాష్ట్ర యాదవ సాధికారిక కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివనందరెడ్డి, మాజీ మంత్రి, నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ్ ఫరూక్, పార్టీ పరిశీలకులు ప్రభాకర్ చౌదరి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ రెడ్డి హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో బీసీలను వైసిపి నాయకులు పొట్టన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి హయాంలోనే బీసీలకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, కాబట్టి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు ఈ ప్రచార రథాలను గ్రామ గ్రామాన తిప్పి ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏవి సుబ్బారెడ్డి, వలసల రామకృష్ణ, ఎన్ఎండి ఫిరోజ్, రామచంద్రరావ్, జిల్లెల శ్రీరాములు, గోవింద్ నాయుడు, నాయకులు నడిపి భూషన్న, తిరుపాల్ బాబు, సురేష్, రజక రామ్ బాబు, మహేష్ గౌడ్, బోయ రామకృష్ణ, ధనుంజయ, వెంకటేష్, శివప్రసాద్, కృష్ణ యాదవ్, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



జయహో బిసి ప్రచార రథాలను ప్రారంభిస్తున్న టిడిపి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టదు

- మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విధ్వంసం అరాచకం తప్ప రైతుల సంక్షేమం పట్టదని తెలుగుదేశం పార్టీ ఉద్యోగాలు తెస్తే జగన్ రెడ్డి రాష్ట్రానికి గంజాయి తెచ్చారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలు పెట్టి రాష్ట్రాన్ని నిలువున కూల్చేశాడన్నారు. రాష్ట్రంలో రోజుకు ముగ్గురు రైతుల ఆత్మహత్యలు చేసుకుంటు న్నారని, కౌలు రౌతు ఆత్మహత్యలో రెండో స్థానంలో, రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో, రైతు అప్పుల్లో దేశంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రజలు మూడు నెలల్లో జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయబోతున్నారని పేర్కొన్నారు.

సొసైటీ స్టాల్స్‌ను పరిశీలించిన కెడిసిసి చైర్మన్

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి కేడిసిసి చైర్మన్ ఎస్‌వి విజయ మనోహరి సోమవారం హాజర య్యారు. పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ పర పతి సంఘం తరఫున ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఎస్‌వి విజయ మనోహరి పరిశీలించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్థలాలు పరిశీలించి ఏ విధంగా వ్యవసాయ వనరులు రైతులకు ఉపయోగపడు తున్నాయో అని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ సిరిగి రామచంద్రారెడ్డి, జడ్పి టిసి పుల్యాల దివ్య తదితరులు పాల్గొన్నారు.



కేడిసిసి చైర్మన్ ఎస్‌వి విజయ మనోహరిని సన్మానిస్తున్న ఉద్యోగులు, తదితరులు

బాబు మాయమాటలకు అమాయకులు బలి

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గంగుల



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాయమాటలకు అమాయకులు బలి అవుతున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు 2014లో అధికారంలోకి రావడానికి 600కు పైగా హామీలతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ తులసమ్మ,జడ్పీటీసి లక్ష్మిదేవి,వైస్ ఎంపిపి రఫి,మహిళా ఆర్థిక సాధికారిక సంస్థ డైరెక్టరు శ్రీవిద్య, జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, వెంకటలక్ష్మి, ఫయాజ్,సర్పంచ్‌లు బంగారు షరీఫ్, ప్రతాపరెడ్డి, మాలిభాష, శంకరమ్మ,గోవిందయ్య,దస్తగిరిరెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా,తహసిల్దార్ సుభద్రమ్మ, నాయకులు వెంకట సుబ్బా రెడ్డి, రామగుర్విరెడ్డి, శేషురమేష్, ఇబ్రహీం, రమణారెడ్డి, దస్తగిరిరెడ్డి,గేట్ల మాబు,అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని ముఖ్య మంత్రి జగనన్న : మున్సిపల్ చైర్మన్

నందికొట్కూరు టౌన్: వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక వారోత్సవాలు నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్క్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, నందికొట్కూరు మండల జెడ్పీటీసీ కరీమున్నిస, నందికొట్కూరు మండల ఎంపీపీ మురళి కృష్ణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ శోభ రాణి పాల్గొని పెన్షన్ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ పింఛన్లను రూ.3000కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెలిపారు. అనంతరం పెన్షన్ లబ్ధిదారులతో కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీసీఎస్ కన్వీనర్ అబ్బుబక్కర్, మున్సిపల్ కౌన్సిలర్లు అబ్దుల్ రావూఫ్, చాంద్ బాషా, హమీద్, సుమలత, అల్లూరి కృష్ణ, నయుబ్, వార్డు ఇంచార్జ్‌లు వీఆర్ శీను, రమేష్, కురువ శీను, సన అబ్దుల్లా, ఆర్ట్ శీను, సత్య నారాయణ, సచివాలయ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

ఇచ్చిన ప్రతి హామీలు నెరవేర్చిన ప్రజా నేత జగన్

- మున్సిపల్ వైస్-చైర్మన్ మొల్ల మహమ్మద్ రబ్బాని

ఇచ్చిన మాట మేరకు లబ్ధిదారులకు రూ.3000 పింఛన్ అందించి అవ్వ తాతల ముఖంలో వెలుగులు నింపిన గొప్ప ప్రజానేత పాలకుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అని మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని కొనియాడారు. వైయస్సార్ పింఛన్ కానుకను సచివాలయ సిబ్బంది సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్సిపి నాయకులు ముజీబ్, వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పసుల శ్రీనివాసులు నాయుడు, ఇమ్రాన్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.



రాజీనామా లేఖను చూపిస్తున్న బెలూం వెంకట సుబ్బారెడ్డి, చిత్రంలో బెలూం వెంకట సుబ్బారెడ్డి అనుచరులు తదితరులు

పని చేసే నాయకుడికి టిడిపిలో విలువలేదు

- పార్టీకి రాజీనామా చేసిన బెలూం వెంకట సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి (బెలూం వెంకట సుబ్బారెడ్డి) పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం బత్తులూరుపాడు సమీపంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి టిడిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే నాయకులకు టిడిపిలో విలువలేదని అన్నారు. టిడిపి ఆవిర్భం నుండి పార్టీ కోసం ఎన్నో సేవలు చేశానని, కోవెలకుంట్ల నియోజకవర్గంలో కర్ర సుబ్బారెడ్డి గెలుపు కోసం కృషి చేశానని, 1994లో మాజీమంత్రి ఎస్‌వి సుబ్బారెడ్డి గెలుపు కోసం తన వంతు కృషి చేశానన్నారు. పార్టీ కోసం తండ్రిని పోటుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కొలిమిగుండ్ల జడ్పిటిసికి తన తల్లి లక్ష్మీదేవి టిడిపి తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి గెలుపు కోసం కొలిమిగుండ్ల మండలం అంతటా తిరిగి గెలిపించామని తెలిపారు. నేను పార్టీకి ఎలాంటి ద్రోహం చేయకపోయినా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తనను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను, మొదటినుండి తెలుగుదేశం పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను నాయకులను దూరం పెడుతున్నారని ఆరోపించారు. బీసీ జనార్దన్ రెడ్డి పక్కన పెడుతున్నారనే విషయాన్ని, వ్యక్తిగత ఇమేజ్ కోసం పార్టీకి ద్రోహం చేస్తున్నారని టిడిపి అధినేత నారా చంద్ర బాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీంతో పార్టీలో ఎందుకు కొనసాగాలని పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. త్వరలో తన బంధువులతో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకొని ఏ పార్టీలో చేరబోయేది ప్రకటిస్తానని తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి


ఈనెల 9వ తేదీన ఆళ్లగడ్డలో జరగనున్న రా కదిలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ కోరారు. సోమవారం తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్, చాగలమర్రి మైనార్టీ నాయకులు కలిసి ఆళ్లగడ్డలో సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు జరిగిన అన్యాయాలు, అవమానాలు అన్నీఇన్నీ కావని మౌలానా ముస్తాక్ అహ్మద్ మండిపడ్డారు. ఇంత దగా, ఇలాంటి అవమానాలు గతంలో జరగలేదని, చంద్రబాబు పాలనలోనే మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ముస్లీం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. మౌలాలి, హనీఫ్, కొలిమి అష్రాఫ్, ఖలీల్, హుస్సేన్ భాష, దాదా పీర్ మక్బూల్‌లు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** ఈనెల 9వ తేదీన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు రా కదలిరా కార్యక్రమంకు నంద్యాల జిల్లాలో ఉన్న ప్రజలంతా బహిరంగ సభకు విజయవంతం చేయాలని టిడిపి అబ్జర్వర్ దేవేలా మురళి కోరారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ తిప్పే స్వామి, నందికొట్కూరు పట్టణ పరిశీలకులుగా కరువా సరిత, నందికొట్కూరు మండల పరిశీలకులుగా థరూర్ జేమ్స్, పగిడ్యాల మండల పరిశీలకులుగా మనోహర్ నాయుడు, మిర్తూర్ మండల పరిశీలకులుగా నాగేంద్ర కుమార్, జూపాడు బంగ్లా మండల పరిశీలకులుగా శ్రీరాములు, పాములపాడు మండల పరిశీలకులుగా ముస్తాక్ అహ్మద్, కొత్తపల్లి మండల పరిశీలకులుగా స్వామి దాసు పార్టీ అధిష్టానం నియమించడం జరిగిందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం నుండి దాదాపు 15వేల మంది ప్రజలు కార్యక్రమానికి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ సూర్య, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, ముత్తు జావలి, నారపురెడ్డి, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు



మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్, చాగలమర్రి మైనారిటీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిని స్వాతి

జొన్న కొనుకోగుల కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- వ్యవసాయ అధికారిని స్వాతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని కె.సునీత తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దొర్నిపాడు మండలంకు సంబంధించి ఎఫ్‌పిఓ వారు జొన్న కొనుగోలు కేంద్రంను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కావున జొన్న పంట వేసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జొన్న క్వింటా ధర రూ.3180 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించిందన్నారు. తూర్పురబట్టిన మంచి ధాన్యమును మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని మద్దూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించారు. సోమవారం గ్రామంలో రూ 23.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ 13 లక్షలతో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఆళ్ళగడ్డ నియోజక వర్గం గంగుల కుటుంబం ద్వారానే అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనం తరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 5 గురు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన విద్యుత్ మోటర్లను,పైపులను ఆయన పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో బ్రాహణపల్లె సర్పంచ్ మహేశ్వరి,ఎంపిపి వీరభద్రుడు,జడ్పిటిసి లక్ష్మిదేవి,వైస్ ఎంపిపి రఫి,ఎంపీటీసి బేబమ్మ,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి,ఏఓ రంగనేతాజి, ఎంపీడీఓ మహబూబ్ దౌలా,ఏపిడి సాంబశివరావు,పిఆర్ డిఈ నరసింహులు,ఏఈ కొండారెడ్డి,వైసీపి నాయకులు ఎంపిటిసి లక్ష్మిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, షరీఫ్,సాల్మన్, శివప్రసాద్, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి,రమణారెడ్డి,సర్పంచ్ గోవిందయ్య, వెంకటరమణ, సచివాలయ, వ్యవసాయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ నగర్ గుడిసె వాసులకు

మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని బిఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలిచ్చి, రోడ్డు, కరెంటు, మంచినీటి సదుపాయం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో జై కిసాన్ పార్కు ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కమిటీ సభ్యుడు పి ఫకీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ కర్నూల్ రోడ్డు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో సర్వేనెంబర్ 589, 590, 595లో దాదాపు 200 మంది గుడిసెలు వేసుకున్నారని 100 కుటుంబాలు నివాసం ఉన్నాయని విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, మంచినీటి సదుపాయం లేకపోవడం వల్ల పేదలు నివాసాలు ఉండలేక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని కావున నివాసం ఉన్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని, కాలనీలో రోడ్లు, మంచినీటి వసతి, వీధి స్తంభాలు వేసి కరెంటు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకు స్పందించిన మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్ల పట్టాలను వారం లోపల ఇస్తామని కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజా సంఘాల నాయకులు ఆంజనేయులు, నాగన్న, రంగమ్మ, జయరాన్ని, దక్క కుమార్, బేస్తరాజు, ఎం కర్ణ, ఏసన్న, నరసింహులు, ఏసేపు, నాగ శేషమ్మ, నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థులు ఇండస్ట్రీయల్ విజిటింగ్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు వృత్తి విద్యా కోర్సు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నాడు ఇండస్ట్రియల్ విజిటింగ్ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌కు తీసుకెళ్లి, ఆపరేటర్ వెంకటప్ప నాయుడుతో 33కేవి సబ్ స్టేషన్‌కు పవర్ సప్లై 132కేవి నుండి స్టెప్ డౌన్ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా ఎలా తగ్గించుకోవాలో, 33కేవి సబ్ స్టేషన్ నుండి 11కేవిగా,రూరల్ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా ఎలా పంపిణీ చేయాలో విశదీకరించారు. దైనందిత జీవితంలో విద్యుత్ సరఫరా ఎంతో ముఖ్యమని, మనం విద్యుత్‌ను సక్రమంగా వినియోగిం చుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్ మహేష్,అల్లి పీరా, సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి,రవిశేఖర్, లక్ష్మయ్య, సుబాన్, బాబు, సుబ్బారాయుడు, ముని రాజు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు

హామీలు అమలు చేయాలి

5వ పేజీ తరువాయి.. ఇవ్వడం లేదన్నారు. కార్మికవర్గంకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ గౌస్, డి.లక్ష్మణ్, డోన్ నాయకులు శివరాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల చేస్తున్న సమ్మెకు టిడిపి పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, జై సూర్య, మతుజావలి, లాయర్ జాకీర్, షకీలా అహ్మద్, మున్సిపాలిటీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సమస్యలపై చర్చలు విఫలం

బేతంచెర్ల : మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో కార్మిక సంఘాల నాయకులు సోమవారం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. సమ్మె 14వ రోజుకు చేరుకున్న సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, పరిశుధ్య కార్మికుల నాయకులతో చర్చలు జరిపారు. కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, భద్రత సామాగ్రి పంపిణీ, తదితర అంశాలపై చర్చించగా సాధ్యమైనంత త్వరగా ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ రమేష్ బాబు నాయకులతో చెప్పారు. కమిషనర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కార్మిక సంఘాల నాయకులు అంగీకరించకపోవడంతో చర్చలు విఫలం అయ్యాయి. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు, డి రాజు, వేణుగోపాల్, రంగడు, సుధాకర్, పద్మావతి, రామాంజనేయులు, రమణ రమణ, ఉసేని, వెంకటేశ్వర్లు, చిన్న ఓబులేసు, శివమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

28వ రోజు అంగన్‌వాడీల సమ్మె

5వ పేజీ తరువాయి.. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి కొత్త సమస్యలు కొనితెచ్చుకుంటుందని అన్నారు. అనేక ఏళ్లుగా గర్భిణులకు, పిల్లలకు సేవలు చేస్తున్న అంగన్వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటీ, విరమణ బెనిఫిట్స్ రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కూర్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి, ప్రాజెక్టు కార్యదర్శి బి.సునీత, సెక్టార్ నాయకురాళ్లు ప్రసన్న, సరస్వతి, నీలిమ, లలితమ్మ, సునీత, వరలక్ష్మి, సారమ్మ, సావిత్రి, అరుణ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోస్పాడులో అంగన్వాడిలు నిరసన ధర్నా చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నిర్మలమ్మ మాట్లాడారు. ఈ సమ్మెలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మార్కు, చెన్నయ్యలు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్వాడి జిల్లా నాయకురాలు రమణమ్మ, సువర్ణమ్మ, భూలక్ష్మి, ఆదిలక్ష్మి, రషీద తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అంగన్వాడీలపై నిర్బంధం ఆపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. యూనియన్ సభ్యులు రమాదేవి, వరలక్ష్మి, మల్లేశ్వరి, మహేశ్వరి, శశికళ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు ప్రమీలమ్మ, వెంకటలక్ష్మి, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యాక్షులు రణధీర్‌లు మాట్లాడారు. ప్రమోషన్‌లలో రాజకీయ జోక్యం అరికటాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేంద్ర, గణపతి, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు. **వృకాసం, కౌలు, రైతు సంఘాల మద్దతు :** వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మా బాష, వీరన్నలు అంగన్వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడారు. **చాగలమర్రి :** అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడి అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. చాలీచాలని జీతాలతో బ్రతుకు జీవనం సాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లతో ఒత్తిడికి గురవుతూ ఉన్న మాపై కనికరము చూపకుండా ఎస్మా చట్టం ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు సంజీవమ్మ, రామసుబ్బమ్మ, నాగమణి, ఏఐటియుసిచంద్రకళ, సిపిఎం నాయకుడు గుత్తి నరసింహుడు, హసీనా, ఇందుమతి, సుజాత, గుర్రమ్మ, మేరీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా

బండి ఆత్మకూర్ : అంగన్వాడీల సమ్మెకు శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బుడ్డ రాజశేఖర్ రెడ్డి దీక్షా శిబిరానికి వెళ్లి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా అణచివేయాలని చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంగన్వాడి ఉద్యమం చేస్తున్న యూనియన్ నాయకులు ఆనందమ్మ వెంకటరమణ వసంత శ్యామల కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. అధిష్టానానికి పంపి మద్దతు తెలిపేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, మండల నాయకులు రాజు, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు బి మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నందిపాడు నరసింహారెడ్డి, సిద్దయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి వస్తే పరిష్కరిస్తాం : మాండ్ర

పాములపాడు : టిడిపి ప్రభుత్వం వస్తే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తప్పనిసరిగా అమలు చేసేందుకు కృషి చేస్తామని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి తెలిపారు. పాములపాడులో అంగన్వాడీల నిరవధిక సమ్మెకు మాండ్ర శివానందరెడ్డి పూర్తిగా మద్దతు తెలిపి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్ నాయకురాలు శివలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, పల్సాని మహేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి,బండ్లమూడి వెంకటేశ్వరరావు, గోవిందు, మదకృష్ణ ,తిమ్మారెడ్డి, హరినాద్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, స్వాములు, లింగాల సర్పంచ్ బాల మల్లేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, అబ్దుల్ హఫీజ్, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, చంద్రశేఖర్, శంకర్ రెడ్డి, హరి ప్రసాద్ యాదవ్, సుంకన్న, లింగేష్ గౌడ్ సిపిఎం నాయకులు బి రామేశ్వరరావు, సామన్న, వెంకటేశ్వరరావు, బాలయ్య,ఎస్ ఆర్ రమణ, బాల యేసు పాల్గొన్నారు.

మరోసారి మోసపోవద్దు : మాజి ఎమ్మెల్యే బుడ్డా :

వెలుగోడు : తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. వెలుగోడు తహసిల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టిన అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. టిడిపి నాయ కులు అన్నారపు శేషి రెడ్డి, డాక్టర్ జాకీర్, ఖలీలుల్లా ఖాన్, జనసేన నాయకులు షాలు బాషా, సిఐటియు నాగమోహన్, అవాజ్ కమిటీ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

నేడు జైలు బరో కార్యక్రమం : సిఐటియు


నందికొట్కూరు టౌన్ : నందికొట్కూర్ పట్టణంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట యూనియన్ నాయకులు మదర్ బి అధ్యక్షతన అంగన్వాడీలు కొనసాగించారు. వహించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, జిల్లా సహా కార్యదర్శి పకిరి సాహెబ్, జిల్లా నాయకులు ఎం కర్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నాగన్న మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిర్బంధించితే అంత ఉద్యమం ఉవ్వెతున్న ఎగిసిపడుతుందని వారు అన్నారు. మంగళవారం నుంచి జైలు బరో కార్యక్రమంతోఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు లక్ష్మి, వెంకటలక్ష్మి, ఉమాదేవి, హరిత, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అంగ న్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను సమస్యలను పరిష్కరించకపోతే కార్మిక సంఘాలను కలుపుకొని తగిన గుణపాఠం చెప్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి సేబారాణి, సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, సిఐటియు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు, హెచ్చరించారు. సమ్మె 28వ రోజుకు చేరుకున్న సందర్భంగా, ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ కె నాగలక్ష్మి, గుల్జార్బి ఆధ్వర్యంలో భారత్ బేకరీ సర్కిల్ నందు రోడ్డుపైన అంగన్వాడీలు 28 సంఖ్య లాగా ఏర్పడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందించకపోగా అంగన్వాడి సంఘం నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేర్లతో కాలయాపన చేయడం అంతేకాకుండా ఎస్మా చట్టాన్ని ఉపయోగించి విధుల నుండి తొలగిస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపి ఈరన్న కడాడిలకు వినతి ఇస్తున్న అంగన్వాడీలు

కలెక్టర్, ఎంపి ఈరన్న కడాడిలకు వినతి

పగిడ్యాల : మా గోడు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కనీసం మా సమస్యలను మీరేనా పట్టించుకోని పరిష్కరించాలని కర్ణాటక రాజ్యసభ సభ్యుడు ఈరన్న కడాడికి అంగన్వాడీలు వినతి పత్రం సమర్పించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి హాజరైన ఈరన్న కడాడికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీలు వినతి పత్రం అందించి సమస్యలు వివరించారు. సమస్యను కేంద్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన అంగన్వాడీలకు తెలిపారు. వికసిత్ భారత సంకల్పయాత్ర ముగించుకుని వెళ్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ మంజీర్ జిలాని సామూన్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా మహిళా నాయకురాలు గంధం హుస్సేనమ్మ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు